సాక్షి ఖమ్మం

7

మంగళవారం ౹ 27 ౹ ఆగస్టు ౹ 2024

గరిష్ఠం / కనిష్ఠం
32° / 24°

వాతావరణం
జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రత ఎక్కువగానే నమోదవుతుంది. ఉదయం మాత్రం కొన్నిచోట్ల కాస్త చల్లగా ఉంటుంది.



జిల్లా కేంద్రంలోని ఓ పాఠశాలలో కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

కృష్ణాష్టమి సందడి..

జిల్లా వ్యాప్తంగా శ్రీ కృష్ణాష్టమి పండుగను సోమవారం వైభవంగా జరుపుకున్నారు. ఆలయాలు, ఇళ్లలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఉట్లు కొట్టే వేడుకలో చిన్నాపెద్ద తేడా లేకుండా అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. పలువురు తల్లిదండ్రులు తమ చిన్నారులను కృష్ణుడు, గోపికల వేషధారణలతో అలంకరించి మురిసిపోయారు. ఆలయాల్లో భక్తులు కోలాటాలు, నృత్యాలతో సందడి చేశారు.



9లో



జిల్లా కేంద్రంలోని మురళీకృష్ణ ఆలయంలో స్వామి

న్యూస్‌రీల్

నేడు మంత్రి తుమ్మల పర్యటన



ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11గంటలకు కలెక్టరేట్‌లో ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన రెవెన్యూ, గృహనిర్మాణశాఖ అధికారులతో ఆయన సమీక్షిస్తారు. ఆతర్వాత 29వ డివిజన్ ప్రకాష్‌నగర్‌లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపన చేయనున్నారు.

నేడు నిధి ఆప్‌కే నికట్

ఖమ్మం సహకారనగర్: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఆధ్వర్యాన మంగళవారం నిధి ఆప్‌కే నికట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్లు రబీలాల్ దాస్, కె.సునీల్ తెలిపారు. ఈసమావేశాల్లో ఉద్యోగులు, పెన్షనర్లకు ఆన్‌లైన్ సేవల విధి విధానాలను వివరించడమే కాక సమస్యలు పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా వాసులు పెనుబల్లిలోని తాళ్లూరి టెక్స్‌టైల్స్‌లో, భద్రాద్రి జిల్లావాసులకు పాల్వంచలోని శ్రీచైతన్య హైస్కూల్‌లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు.

రైతు సంఘం ఆధ్వర్యంలో నేడు ఆందోళన

ఖమ్మంమయూరిసెంటర్: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలనే డిమాండ్‌తో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టనున్నట్లు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు తెలిపారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం నాన్చివేత ధోరణి కారణంగా రైతాంగానికి నష్టం ఎదురవుతోందని చెప్పారు. ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా జిల్లాలో కేవలం 30 శాతం మందికే రుణమాఫీ జరిగిందని తెలిపారు. కొర్రీలు, సాంకేతిక కారణాలు సాకుగా చూపుతూ రుణమాఫీ చేయడం లేదని ఆరోపించారు. ఇకనైనా అర్హత కలిగిన రైతులందరికీ రూ.2లక్షల లోపు రుణాలు తక్షణమే మాఫీ చేయాలనే డిమాండ్‌తో మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న ధర్నాలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు సోమవారం ఓ ప్రకటనలో కోరారు.

'లిఫ్ట్'ల మరమ్మతులకు నిధులు

పెనుబల్లి : పెనుబల్లిలోని రాతోని ఎత్తిపోతల పథకంతో పాటు తాళ్లపెంట, కల్లూరు మండలం బత్తులపల్లి, నారాయణపురం, కప్పలబంధం ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. ఈ ఎత్తిపోతల పథకాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు కొన్నాళ్ల క్రితం ధ్వంసం చేయగా.. ఇంకొన్ని మూలనపడ్డాయి. దీంతో ఐదు ఎత్తిపోతల పథకాల నుంచి నీటి సరఫరా నిలిచిపోయింది. ఈవిషయమై రైతులు సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి దయానంద్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించారు. ఇప్పటికే అధికారులు టెండర్లు ఆహ్వానించగా త్వరలోనే పనులు మొదలయ్యే అవకాశముంది.

నేటి నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడాపోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యాన ప్రభుత్వ ఉద్యోగులకు ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా మంగళవారం నుంచి గురువారం వరకు పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. క్రికెట్, చెస్, వాలీబాల్, టేబుల్ టెన్నిస్, త్రోబాల్, మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్‌తో 50, 100 మీటర్ల పరుగు, 400 మీటర్ల నడక, 50 మీటర్ల సాక్‌రేస్, టగ్ ఆఫ్ వార్, బ్యాడ్మింటన్ అంశాల్లో పోటీలు ఉంటాయని వెల్లడించారు. ఆసక్తి ఉన్న ఉద్యోగులు మంగళవారం ఉదయం 8గంటలకు స్టేడియంలో రిపోర్టు చేయాలని సూచించారు.

కేంద్రియ విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తులు

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లిలోని కేంద్రియ విద్యాలయంలో రెండు నుండి 8వ తరగతి వరకు ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కవీంద్ర రాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో భర్తీ చేయగా మిగిలిన సీట్లలో ప్రవేశాలు కల్పిస్తామని, ఆసక్తి ఉన్న వారు ఈనెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశాల ప్రక్రియ న్యూఢిల్లీలోని కేంద్రీయ విద్యాలయ సంఘటన్ మార్గదర్శకాల మేరకు జరుగుతుందని ఆయన తెలిపారు.

మూడు.. దాటడం లేదు!

సత్తుపల్లి, మధిర, 'గూడెం'లోనే రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లకు సొంత భవనాలు

- మిగతావన్నీ అరకొర వసతులతో అద్దె భవనాల్లో..
- కొన్ని చోట్ల శంకుస్థాపనకే పరిమితం
- ఆదాయం తెస్తున్న శాఖకు సౌకర్యాలు అంతంతే ..
- తాజాగా సొంత భవనాల నిర్మాణంపై మంత్రి పొంగులేటి హామీ



అద్దె భవనంలో కొనసాగుతున్న వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: అసలే అద్దె భవనాలు.. అపై ఇరుకు గదులు.. ముఖ్యమైన ఫైళ్లను భద్రపరిచేందుకు కూడా కానరాని స్థలం, విభాగాల వారీగా కరువైన గదులు.. ఇవీ ప్రభుత్వానికి ఘనమైన ఆదాయాన్ని చేకూరుస్తున్న రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాల పరిస్థితి. ఉమ్మడి జిల్లాలో 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా కేవలం మూడు మాత్రమే సొంత భవనాల్లో, మిగిలినవి అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. నిత్యం ఆస్తుల అమ్మకాలు, కొనుగోళ్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు ఈ కార్యాలయాల్లో జరుగుతున్నా సొంతభవనాలు లేకపోవడంతో అటు ఉద్యోగులు, ఇటు క్రయవిక్రయదారులు అవస్థ పడుతున్నారు. గతంలో కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేసినా పనులు ముందుకు సాగలేదు. శాఖ ఉన్నతాధికారులు, రిజిస్ట్రార్లు, సబ్ రిజిస్ట్రార్లతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కార్యాలయాలకు సొంత భవనాల నిర్మిస్తామని ప్రకటించడంతో సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నారు.

అసౌకర్యాలకు నెలవు

భూములు, ఆస్తుల క్రయవిక్రయాలు నానాటికీ పెరుగుతుండగా రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకోవడంతో రిజిస్ట్రేషన్లు కూడా అదే స్థాయిలో ఉంటున్నాయి. అయితే, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అరకొర వసతులు కలిగిన అద్దె భవనాల్లో ఉండడంతో వచ్చే వారికి, ఉద్యోగులకు అసౌకర్యంగా మారాయి. అద్దె భవనాల్లో ఉన్న కార్యాలయాల్లో పలు విభాగాలకు సరిపడా గదులు కూడా లేవు. దీంతో ఫొటోలు దింపే కంప్యూటర్ ఆపరేటర్ సబ్ రిజిస్ట్రార్ కేబిన్ ముందే టేబుల్ ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

భారీగానే అద్దె బకాయిలు

ఉమ్మడి జిల్లాలో 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు గాను సత్తుపల్లి, మధిర, కొత్తగూడెంలో ప్రభుత్వ భవనాల ద్వారా సేవలందుతున్నాయి. ఇక ఖమ్మం, ఖమ్మంరూరల్, కూసుమంచి, వైరా, కల్లూరు, ఇల్లెందు, పినపాక, భద్రాచలం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతోపాటు జిల్లా రిజిస్ట్రార్, చిట్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఈ భవనాల్లో ముఖ్యమైన ఫైళ్ల భద్రపర్చడం, విభాగాల వారీగా కేబిన్ల ఏర్పాటుకు స్థలం లేక అధికారులు, ఉద్యోగులు ఇబ్బంది పడుతూనే విధులు నిర్వర్తిస్తున్నారు. అద్దె భవనాలకు నెలకు దాదాపు రూ.4లక్షల వరకు అద్దెలు చెల్లిస్తుండగా.. జిల్లాలో రూ.కోటికి పైగా బకాయి ఉన్నట్లు తెలుస్తోంది. ఖమ్మంలోని జిల్లా రిజిస్ట్రార్, చిట్ రిజిస్ట్రార్, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు నెలకు రూ.2 లక్షల చొప్పున మూడేళ్ల అద్దె కట్టాల్సి ఉంది.

ఇక సొంత భవనాలు

ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం సమకూరుస్తున్న శాఖల్లో రిజిస్ట్రేషన్ల శాఖ ప్రధానమైంది. ఉమ్మడి జిల్లా నుంచి ఏటా 50 వేల డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అవుతుండగా దాదాపు రూ.250 కోట్ల వరకు ఆదాయం ప్రభుత్వ ఖజానాలో జమ అవుతోంది. ఈ నేపథ్యాన రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులు, జిల్లా రిజిస్ట్రార్లు, సబ్ రిజిస్ట్రార్లతో హైదరాబాద్‌లో భేటీ అయిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అద్దె బకాయిలు విడుదల చేయడమే కాక రాబోయే ఐదేళ్లలో రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మిస్తామని ప్రకటించారు. దీంతో దశలవారీగా సకల సౌకర్యాలతో ఈ నిర్మాణాలు పూర్తి చేయనున్నారు. పనుల నిమిత్తం వచ్చే వారు కూర్చునేందుకు వరండాలు, పార్కింగ్ షెడ్లతో పాటు వీఐపీ లాంజ్‌లు సైతం నిర్మించి తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పిస్తారు.

స్థలం చూపించినా నిధులు లేక

పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ప్రభుత్వం స్థలాలు కేటాయించి శంకుస్థాపనలు చేసినా నిర్మాణాలు జరగలేదు. వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి 2016 జూన్ 12న శంకుస్థాపన చేస్తే ఇప్పటికీ పనులు మొదలుకాలేదు. ఇక జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతోపాటు ఖమ్మం, ఖమ్మంరూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి ఖమ్మంరూరల్ మండలంలోని పోలేపల్లి వద్ద స్థలం కేటాయించింది. అయినా ఇప్పటి వరకు పురోగతి లేదు. నిధులు మంజూరు చేయకపోవడంతోనే భవన నిర్మాణాలు ఆగిపోయినట్లు చెబుతున్నారు.

రుణమాఫీ ఎందుకు కాలేదు?

- రైతుల ఫిర్యాదులపై సర్వే
- వివరాల నమోదుకు అందుబాటులోకి పోర్టల్
- నేడు వెల్లడి కానున్న విధివిధానాలు
- రూ.2లక్షలకు పైబడిన రుణం చెల్లించేందుకు వెసులుబాటు



రుణమాఫీ జరగలేదని నేలకొండపల్లిలో ఏఓకు ఫిర్యాదు చేస్తున్న రైతులు (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: రుణమాఫీ వర్తించని రైతుల ఫిర్యాదులపై ప్రత్యేక సర్వే చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అర్హులైనప్పటికీ మూడు విడతల్లోనూ రుణమాఫీ కాలేదని వేలాదిగా రైతులు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ నేపథ్యాన అర్హులను సర్వే ద్వారా గుర్తించాలని వ్యవసాయ శాఖను ప్రభుత్వం ఆదేశించగా.. సర్వే వివరాలను ఎప్పటికప్పుడు 'రైతు భరోసా పంట రుణమాఫీ' పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. ఈ విషయమై మంగళవారం జరిగే రైతునేస్తం కార్యక్రమంలో ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేయనున్నారు. అంతేకాకుండా రూ.2 లక్షలకు పైబడి రుణాలు కలిగిన రైతులకు వెసులుబాటు కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

సగం కూడా కాలే...

జిల్లాలో 3లక్షల మందికి రైతులకు రుణమాఫీ వర్తిస్తుందని ఆశించారు. అయితే, మూడు విడతల్లో కేవలం 1.15 లక్షల మందికే నగదు జమ అయింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నోడల్ బ్యాంకులు గుర్తించిన వారికి సైతం రుణమాఫీ కాకపోగా రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పలుచోట్ల ఆందోళనలు కూడా చేపట్టారు. అయితే, రేషన్ కార్డులు లేనివారు, ఇతర కారణాలతో పెద్ద సంఖ్యలో రైతులు రుణమాఫీకి దూరమైనట్లు తెలుస్తుండగా అర్హులందరికీ వర్తింపజేయాలనే భావనతో ప్రభుత్వం సర్వేకు సిద్ధమైంది.

ఇప్పటికే ట్రయల్స్

పెద్ద సంఖ్యలో రైతులు రుణమాఫీకి నోచుకోకపోవటంతో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. వీటి ఆధారంగా రైతుల ఇళ్లకు వెళ్లి సర్వే చేయాలని ఉన్నతాధికారులు జిల్లా వ్యవసాయ అధికారులకు సూచించారు. అంతేకాక సర్వే వివరాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదించేలా 'రైతు భరోసా పంట రుణమాఫీ' పోర్టల్‌ను ఈనెల 24న అందుబాటులోకి తీసుకొచ్చారు. వ్యవసాయాధికారులు ఇప్పటికే ట్రయల్‌గా అధికారుల వివరాలను నమోదు చేస్తున్నారు. కాగా, సర్వేలో క్లస్టర్ల వారీగా ఏఈఓలు, ఏఓలు, ఏడీఏలు పాల్గొననుండగా జిల్లా స్థాయిలో వ్యవసాయాధికారి పర్యవేక్షిస్తారు.

ఎలా చేయాలి...

పంటల సాగులో మెళకువలు వివరించేందుకు ప్రభుత్వం, వ్యవసాయ శాఖ ప్రతీ మంగళవారం 'రైతునేస్తం' పేరిట రైతు వేదికల ద్వారా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ మంగళవారం నిర్వహించే రైతునేస్తంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎం.రఘునందన్ రావు, కమిషనర్ గోపి తదితరులు పాల్గొని సర్వే అంశంపై ఉద్యోగులకు దిశానిర్దేశం చేయనున్నారు.

ఇప్పటికే 15 వేల ఫిర్యాదులు

జిల్లాలో రుణమాఫీకి నోచుకోని రైతుల నుంచి ఇప్పటి వరకు 15 వేల దరఖాస్తులు అందాయి. కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన 'పరిష్కృతి' కేంద్రంతో పాటు డివిజన్, మండల, క్లస్టర్ల స్థాయిలో రైతులు వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. ఇప్పుడు మొదలు కానుండడంతో ఈ ఫిర్యాదుల సంఖ్య మరింత పెరుగుతుందని భావిస్తున్నారు.

రూ.2 లక్షలకు పైబడి ఉంటే...

రైతులకు రూ.2లక్షల లోపు రుణాలు ఉంటే మూడు విడతల్లో మాఫీ చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే, రూ.2లక్షలకు పైబడి రుణాలు కలిగిన వారు.. ఎక్కువ ఉన్న మొత్తాన్ని చెల్లించాలని మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. అయినప్పటికీ రైతులు మాత్రం మాఫీ వర్తిస్తుందో, లేదోనన్న మీమాంసతో చెల్లించలేదు. కొందరు చెల్లించినా మూడు విడతల్లో మాఫీ కాలేదు. ఈనేపథ్యాన రూ.2 లక్షలకు పైబడి రుణాలు కలిగిన రైతులు సైతం ఎక్కువగా ఉన్న మొత్తాన్ని చెల్లిస్తే రూ.2లక్షల వరకు విడతల వారీగా మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం.

జిల్లాలో రుణమాఫీ వివరాలు

విడత	రైతుల సంఖ్య	రుణమాఫీ(రూ.ల్లో)
మొదటి	57,857	264,22,51,892
రెండో	33,942	262,50,56,893
మూడో	23,546	245,85,90,089
మొత్తం	1,15,345	772,58,98,874

గీత కార్మికులకు రక్ష.. కాటమయ్య కిట్లు

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి: కల్లుగీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పాటుపడుతోందని.. అందులో భాగంగానే వృత్తిలో ప్రమాదాల బారిన పడకుండా కాటమయ్య రక్షా కిట్లను తీసుకొచ్చిందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన పలువురు గీత కార్మికులకు కిట్లు అందజేసి మాట్లాడారు. తాటిచెట్టు ఎక్కే సమయాన ప్రమాదాల బారిన పడకుండా కాపాడుకునేలా హైదరాబాద్‌లోని ఐఐటీ కిట్లను రూపొందించిందని తెలిపారు. బీసీ కార్పొరేషన్, ఎక్సైజ్ శాఖ, కల్లుగీత కార్మికుల సహకార సంఘాల ఆధ్వర్యంలో గీతకార్మికులకు వీటిని పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కాగా, వన మహోత్సవంలో భాగంగా రియల్ ఎస్టేట్ వెంచర్లలో రహదారుల పక్కన, చెరువులు, కాల్వల గట్ల వెంట తాటి, ఈత మొక్కలు నాటనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఆర్డీఓ గణేష్, బీసీ సంక్షేమాధికారి జ్యోతి, ఎక్సైజ్ డిప్యూటీ సూపరింటెండెంట్ వేణుగోపాల్‌రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



కిట్లు అందజేస్తున్న మంత్రి పొంగులేటి, పక్కన అదనపు కలెక్టర్ మధుసూదన్

1,313 టన్నుల యూరియా దిగుమతి

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మంకు రైల్వే వ్యాగిన్ల ద్వారా సోమవారం 1313 మెట్రిక్ టన్నుల యూరియా దిగుమతి అయింది. ఆర్‌సీఎఫ్ కంపెనీకి చెందిన ఈ యూరియాను ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని గోదాంలకు ఇక్కడ నుంచి లారీల్లో పంపించారు. భద్రాద్రి జిల్లాకు 700 మెట్రిక్ టన్నులు, ఖమ్మం జిల్లాకు 313, మహబూబాబాద్ జిల్లాకు 300 మెట్రిక్ టన్నుల చొప్పున యూరియా పంపించామని అధికారులు తెలిపారు. కాగా, జిల్లాలోని మార్క్‌ఫెడ్ గోదాముల్లో ఇప్పటికే 25 వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉండగా.. సెప్టెంబర్ నుంచి యాసంగి సీజన్ వరకు సరిపడేలా అవసరమైన మేరకు నిల్వ చేస్తున్నట్లు వెల్లడించారు.

వంద కాదు.. యాభై పడకలే



వంద పడకల ఆస్పత్రిగా డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేసిన శిలాఫలకం

- వైరాలో వంద పడకల ఆస్పత్రికి తొలుత ఉత్తర్వులు
- ఆ తర్వాత 50 పడకలకు కుదించినట్లు వెలుగులోకి...
- ఈనెల 9న నిర్మాణాలకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన

వైరా: బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయాన వైరా నియోజకవర్గ కేంద్రానికి వంద పడకల ఆస్పత్రిని మంజూరు చేసింది. అంతేకాకుండా 98 మంది ఉద్యోగులను కూడా కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే, ఎలాంటి పనులు మాత్రం మొదలుకాలేదు. ఆతర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో పాత ఉత్తర్వులనే కొనసాగిస్తూ ఈనెల 9వ తేదీన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వైరాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వెనకాల ప్రభుత్వం స్థలంలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయితే, ఆయన శంకుస్థాపన చేయడానికి ముందే ఆస్పత్రిని 50 పడకలకు కుదిస్తూ ఉత్తర్వులు వచ్చినా శిలాఫలకంపై వంద పడకలుగానే పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రితో పాటు వైద్య, విధాన పరిషత్ అధికారులకు లేఖ రాశారు. ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసినందున వంద పడకలుగా కొనసాగించాలని ఆయన లేఖల్లో కోరారు.

ఏడాది క్రితం రూ. 37.50 కోట్లు

గతేడాది జూలై 27న వైరాలోని వంద పడకల ఆస్పత్రికి రూ.37.50కోట్లు కేటాయిస్తూ వైద్య, విధాన పరిషత్ కమిషనర్ కార్యాలయం నుండి ఉత్తర్వులు జారీ అయ్యాయి. అంతేకాక గతేడాది సెప్టెంబర్ 30న 23మంది వైద్యులతో పాటు ఇతర సిబ్బంది కలిపి 98మందిని కేటాయించారు. అయితే, ఎలాంటి పనులు మొదలుకాకపోవడంతో కొందరు ఉద్యోగులను డిప్యూటేషన్‌పై ఇతర మండలాలకు పంపించారు. ఇంతలోనే ఈ ఏడాది జూలైలో ఇక్కడి ఆస్పత్రిని 50 పడకలకు కుదిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈ విషయం ఇటీవల బయటపడగా ఈనెల 9న వంద పడకల ఆస్పత్రిగానే పేర్కొంటూ శిలాఫలకాన్ని ఏర్పాటుచేసి డిప్యూటీ సీఎం భట్టి శంకుస్థాపన చేశారు. ఈనేపథ్యాన టెండర్లు పూర్తి కాకపోవడం, మరోవైపు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేసినందున మార్పు చేయొద్దని ఎమ్మెల్యే ఉన్నతాధికారులకు రాసిన లేఖల్లో కోరారు. ఈ విషయమై డీసీహెచ్‌ఓ రాజశేఖర్‌గౌడ్‌ను వివరణ కోరగా 100 పడకలుగా కొనసాగించాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు వివరించారు.

క్లుప్తంగా

ఆర్‌డీఐఓ, ప్రియదర్శిని నడుమ ఎంఓయూ



ఒప్పందం పత్రాలు కుదుర్చుకుంటున్న కళాశాల, సంస్థ ప్రతినిధులు

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలం పెదతండాలోనిప్రియదర్శిని మహిళా ఇంజినీరింగ్ కళాశాల, ఖమ్మంలోని ఆర్‌డీఐఓ సంస్థల మధ్య అవగాహనా ఒప్పందం(ఎంఓయూ) కుదిరింది. ఈసందర్భంగా సోమవారం కళాశాలలో జరిగిన ఇరు సంస్థల ప్రతినిధుల సమావేశంలో కళాశాల చైర్మన్ కె.నవీన్‌బాబు మాట్లాడారు. ఆవిష్కరణలు, పరిశోధనా నైపుణ్యం, విద్యాపరమైన వృద్ధిని సాధించేందుకు ఈ ఒప్పందం ఉపకరిస్తుందని తెలిపారు. ఆర్‌డీఐఓ సంస్థ ప్రతినిధి కార్తీక్ మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకులకు ఆసక్తి ఉన్న రంగాల్లో పరిశోధనలకు సహకారం ఉంటుందని వెల్లడించారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ, ప్రిన్సిపాల్ బి.గోపాల్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

పలు ప్రైవేట్ ఆస్పత్రులపై సీఐడీ కేసులు

ఖమ్మంక్రైం: ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్)కి సంబంధించి నకిలీ బిల్లులతో సొమ్ము కాజేసిన ఉమ్మడి జిల్లాలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులపై సోమవారం సీఐడీ అధికారులు కేసులు నమోదు చేశారు. చికిత్స చేయకున్నా చేసినట్లు, పరికరాలు లేకున్నా ఉన్నట్లుగా నమ్మించి నకిలీ పత్రాలతో కొన్ని ఆస్పత్రుల యజమాన్యాలు రూ.కోట్ల మేర బిల్లులు తీసుకున్నారని సీఎంఆర్ఎఫ్ రెవెన్యూ విభాగం సెక్షన్ ఆఫీసర్ డీఎస్ఎస్.మూర్తి గత ఏడాది సీఐడీకి ఫిర్యాదు చేశారు. దీంతో అదే ఏడాది ఏప్రిల్‌లో అధికారులు రాష్ట్రవ్యాప్తంగా ఆరోపణలు ఉన్న ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు చేపట్టారు. ఈ జాబితాలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని ఆస్పత్రులు కూడా ఉండగా.. ఖమ్మంలో ఆరు, భద్రాద్రి జిల్లా కేంద్రంలో నాలుగు ఆస్పత్రులపై కేసు నమోదైంది. త్వరలోనే ఆయా ఆస్పత్రుల బాధ్యులను అరెస్ట్ చేసే అవకాశముందని సమాచారం.

రైల్వే చప్టాపై బైక్‌ను ఢీకొట్టిన రైలు


తృటిలో తప్పించుకున్న యువకుడు

రఘునాథపాలెం: మండలంలోని పాపటపల్లి రైల్వేస్టేషన్ చివరన వృద్ధులు ప్లాట్‌ఫారం మారేందుకు నిర్మించిన చప్టా పైనుంచి బైక్‌తో దాటేందుకు యత్నించిన వ్యక్తి తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. సదరు యువకుడు బైక్‌తో ట్రాక్ దాటేందుకు ప్రయత్నిస్తున్న సమయాన తిరువనంతపురం నుంచి ఢిల్లీ వెళ్తున్న కేరళ ఎక్స్‌ప్రెస్ వేగంగా వస్తోంది. దీన్ని గమనించిన ఆయన బైక్‌ను వదిలేసి దూరంగా పోవడంతో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన రైలు కిలోమీటరు మేర ఈడ్చుకుపోయింది. బైక్ తక్కుతుక్కు కావడంతో పాటు వాహనం ట్యాంక్ కవర్‌లో ఉన్న సెల్‌ఫోన్, ఇతర సామగ్రి సైతం ధ్వంసమయ్యాయి. ఘటనపై రైలు డ్రైవర్ డోర్నకల్ జీఆర్పీ పోలీసులకు సమాచారం ఇవ్వగా.. ఉద్యోగులు చేరుకుని వివరాలు సేకరించడంతో పాటు రైల్వే ట్రాక్‌ను పరిశీలించారు.

నేడు వీకే-7, రొంపేడు గనులపై ఎఫ్ఏసీ భేటీ

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధి వీకే-7 ఓసీ, ఇల్లెందు ఏరియాలోని రొంపేడు ఓసీలకు సంబంధించి అనుమతి విషయమై మంగళవారం ఎఫ్ఏసీ(ఫారెస్ట్ అడ్వయిజరీ కమిటీ) సమావేశం జరగనుంది. మొదటి దశ పర్యావరణ అనుమతులు జారీ చేసేందుకు ఢిల్లీలో ఈ సమావేశం ఏర్పాటుచేయగా సింగరేణి నుంచి అధికారుల బృందం పూర్తి వివరాలతో అక్కడకు వెళ్లింది. గత మూడేళ్లుగా అనుమతులపై తాత్సారం జరుగుతుండడగా ఈసారైనా సాధించాలనే లక్ష్యంతో అధికారులు కృషి చేస్తున్నట్లు సమాచారం. ఈ రెండు గనులకు స్టేజ్ -1 అనుమతులు లభిస్తే ఈ ఏడాది సుమారు 7.5 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి నమోదవుతుందని చెబుతున్నారు. తద్వారా సంస్థ నిర్దేశించుకున్న 72 మిలియన్ టన్నుల వార్షిక లక్ష్యాన్ని చేరుకోవడం సులభమవుతుందని భావిస్తున్నారు.

నెమ్మదిగా పెరుగుతున్న గోదావరి



భద్రాచలం వద్ద గోదావరి

భద్రాచలంటౌన్: భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం నెమ్మదిగా పెరుగుతోంది. ఆదివారం సాయంత్రం 20.2 అడుగులు ఉన్న నీటి మట్టం సోమవారం రాత్రికి 28 అడుగులకు చేరింది. నది ఎగువ ప్రాంతాల్లో వర్షాలు పడుతుండడంతో నీటి మట్టం పెరుగుతోందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. మరో రెండు అడుగులు పెరిగి, ఆ తర్వాత తగ్గే అవకాశం ఉందని అంటున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,828

లిథియంపై నజర్



బొగ్గు తవ్వకాలతో మొదలైన సింగరేణి సంస్థ బహుముఖంగా విస్తరించే ప్రయత్నాలను వేగవంతం చేస్తోంది. ఇప్పటికే థర్మల్ విద్యుత్ ఉత్పత్తిలో దూసుకుపోతున్న సంస్థ.. గ్రీన్ ఎనర్జీలోనూ తనదైన ముద్ర వేస్తోంది. ఈ క్రమంలో లిథియం మైనింగ్‌పై దృష్టి సారించింది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

బహుముఖ విస్తరణపై సింగరేణి దృష్టి

- లిథియం మైనింగ్‌పై ఈనెల 28న డైరెక్టర్ల స్థాయి సమావేశం
- ఇప్పటికే ఈ బ్లాక్‌లను వేలం వేస్తున్న కేంద్రం
- గత నవంబర్‌లో మొదలైన ప్రక్రియ

బ్యాటరీలకు పెరుగుతున్న డిమాండ్..

మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల వినియోగం పెరిగిన తర్వాత లిథియం అయాన్ బ్యాటరీలకు డిమాండ్ ఎక్కువైంది. తక్కువ పరిమాణంలో ఇమిడిపోతూ ఎక్కువ విద్యుత్ శక్తిని నిల్వ చేయడం ఈ బ్యాటరీల ప్రత్యేకత. ప్రస్తుతం లిథియం అయాన్ బ్యాటరీలను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. అయితే వాయు కాలుష్య కట్టడిలో భాగంగా పెట్రోల్, డీజిల్ వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు ఈవీ రంగానికి ప్రోత్సాహకాలు, క్షేత్రస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. అయితే భవిష్యత్‌లో పెరిగే అవసరాలను దృష్టిలో ఉంచుకుని మన దేశంలోనే లిథియాన్ని వెలికి తీయాలని నిర్ణయించింది.

సింగరేణికి సూచన..

మైనింగ్ రంగంలో అపార అనుభవం గల సింగరేణి సంస్థ గత పదేళ్లుగా విస్తరణ బాట పట్టింది. ముందుగా మంచిర్యాల జిల్లా జైపూర్‌లో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రారంభించింది. అక్కడ వచ్చిన విజయాలతో త్వరలో రామగుండం, ఒడిశాలోని నైనీలలో క్యాప్టివ్ థర్మల్ విద్యుత్ కేంద్రాల స్థాపనకు సిద్ధమవుతోంది. మరోవైపు సోలార్ ఎనర్జీలోనూ సత్తా చాటింది. సంస్థ విస్తరించిన ఆరు జిల్లాల పరిధిలో 500 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి దిశగా ఒక్కో అడుగు వేస్తూ సాగుతోంది. అంతేకాదు.. జియో థర్మల్, పంప్డ్ స్టోరేజీ హైడల్ పవర్ ప్లాంట్ వంటి గ్రీన్ ఎనర్జీలపైనా పని చేస్తోంది. వందేళ్లకు పైగా తెలంగాణకే పరిమితమైన సంస్థ ఇప్పుడు ఒడిశాలోని నైనీ బ్లాక్‌లో బొగ్గు ఉత్పత్తికి సిద్ధమైంది. ఈ క్రమంలో లిథియం మైనింగ్‌లోకి సింగరేణి వస్తే బాగుంటుందని కేంద్ర ప్రభుత్వం అభిప్రాయపడుతోంది. ఈ మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇటీవల లిథియం మైనింగ్‌పై దృష్టి సారించాలని సింగరేణి యాజమాన్యానికి సూచించారు. అందులో భాగంగా లిథియం మైనింగ్‌కు సంబంధించి సమాచార సేకరణ, విశ్లేషణతో పాటు యాక్షన్ ప్లాన్ రూపొందించుకునే పనిలో సంస్థ ఉంది. ఆగస్టు 28న ఈ అంశంపై డైరెక్టర్ల స్థాయిలో సమావేశం నిర్వహించే అవకాశం ఉంది.

ఛత్తీస్‌గఢ్‌లో తొలి వేలం..

కేంద్ర సర్వే సంస్థల రికార్డుల ప్రకారం దేశంలోని బిహార్, గుజరాత్, జార్ఖండ్, ఒడిశా, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జమ్ము కశ్మీర్ రాష్ట్రాల్లో లిథియం నిల్వలు ఉన్నట్లు తేలింది. ఈ ఖనిజాన్ని వెలికితీసేందుకు కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాక్‌ల తరహాలోనే గతేడాది నవంబర్‌లో బహిరంగ వేలం నిర్వహించింది. మిగిలిన ఖనిజాల మైనింగ్‌తో పోల్చితే లిథియం వెలికితీతకు ప్రైవేట్, ప్రభుత్వ రంగ సంస్థలు అంతగా ఆసక్తి చూపించలేదు. దీంతో మూడోసారి వేలం నిర్వహించగా ఛత్తీస్‌గఢ్‌లోని కోర్బా జిల్లాలో ఉన్న కాట్గోరా బ్లాక్‌ను ఓ ప్రైవేట్ సంస్థ దక్కించుకుంది. శాంతి భద్రతల సమస్య కారణంగా కశ్మీర్ బ్లాక్‌ను కైవసం చేసుకునేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు ముందుకు రాలేదు. అయితే లిథియం మైనింగ్‌కు నిర్వహించిన వేలంలో తమిళనాడు కేంద్రంగా పని చేస్తున్న ప్రభుత్వ రంగ సంస్థ నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్ఎల్‌సీ) ఇండియా పాల్గొంది. ఈ సంస్థ బొగ్గు, లిగ్నైట్ మైనింగ్‌తో పాటు థర్మల్, సోలార్ ఎనర్జీ రంగంలో రాణిస్తోంది.

అధికారుల్లో కదలిక..

- గిరిజన సొసైటీ సభ్యత్వ వివాదంపై ఆరా
- మరోపక్క ఆగని కౌలుదారుల ఆగడాలు
- సాగుచేసేలా భూమి దున్నించిన పలువురు

సత్తుపల్లి: సత్తుపల్లి మండలం బేతుపల్లి రెవెన్యూ సర్వే నంబర్ 40/1లో ఉన్న ట్రైబల్ జాయింట్ ఫార్మింగ్ కోఆపరేటివ్ సొసైటీ బి.గంగారం భూముల వివాదంపై ఎట్టకేలకు అధికారులు దృష్టి సారించారు. 'సాక్షి'లో మూడు రోజులుగా ప్రచురితమైన కథనాలు చర్చనీయాంశంగా మారిన నేపథ్యాన సహకార సంఘం, రెవెన్యూ, నిఘా వర్గాలు అప్రమత్తమై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించినట్లు తెలిసింది. గిరిజన సొసైటీ పేరిట 125 ఎకరాల భూమి ఉండగా యజమానులైన గిరిజనులు అదే పొలంలో కూలీలుగా పని చేస్తున్నారని బయటపడడంతో విస్తుపోతున్నారు. ఇటీవల ఖమ్మం డీసీఓగా బాధ్యతలు స్వీకరించిన గంగాధర్ సొసైటీ విధివిధానాలను పరిశీలిస్తుండగా.. త్వరలోనే సొసైటీ బాధ్యులతో సమావేశం కానున్నట్లు తెలిసింది.



గిరిజన సొసైటీ భూముల్లో దున్నిన ప్రాంతం

2022 నుంచి ఎన్నికలు లేవు..

గిరిజన సొసైటీకి ఐదేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించా ల్సి ఉన్నా గిరిజనుల మధ్య వివాదంతో 2022 ఫిబ్రవరి నుంచి ఎన్నికలు జరగలేదు. దీంతో ప్రస్తుతం సొసైటీకి పాలకవర్గం లేకుండా పోయింది. జిల్లా సహకార సంఘం అధికారులు ఎప్పటికప్పుడు బైలా అమలుపై పర్యవేక్షించాల్సి ఉన్నా అలా జరకపోవడంతో సమస్య నానాటికీ మరింత జటిలమవుతోంది. సొసైటీ సభ్యుల నడుమ వివాదాన్ని పరిష్కరించాలని సహకార సంఘం అధికారులకు ఇరువర్గాల గిరిజనులు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అయితే నిబంధనల ప్రకారం బయట పట్టా భూమి ఉన్న వారికి సొసైటీలో సభ్యత్వం ఉండదని.. అయినా ఎనిమిది మంది సభ్యులుగా ఉన్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం.

భూమిలోకి వెళ్లొద్దు

సహకార సంఘం అధికారులు సభ్యత్వం, హక్కు వివాదాన్ని పరిష్కరించే వరకు గిరిజనులతో పాటు కౌలుదారులు కూడా సొసైటీ భూముల్లోకి వెళ్లొదన్న సత్తుపల్లి పట్టణ సీఐ టి.కిరణ్ సూచనకు అంతా అంగీకరించారు. అయితే గిరిజన సొసైటీలో కౌలుదారులు పిడుగు సత్యనారాయణ, బెజవాడ శ్రీనివాసరావు, సమయమంతుల శ్రీనివాసరావు మాత్రం యథావిధిగానే పనులు చేస్తున్నారని తెలిసింది. సోమవారం ఉదయం పిడుగు సత్యనారాయణ సుమారు ఐదెకరాల మేర ట్రాక్టర్‌తో దున్నించి విత్తనాలు వేసేందుకు సిద్ధమయ్యారని, సమయమంతుల శ్రీనివాసరావు, బెజవాడ శ్రీనివాసరావు మొక్కజొన్న, పామాయిల్ తోటల్లో పని చేస్తున్నారని చెబుతున్నారు. అధికారులు త్వరగా స్పందించి కౌలుదారుల నుంచి భూములను రక్షించి అర్హత కలిగిన గిరిజనులకు వ్యక్తిగత పట్టాలు ఇప్పించాలని గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశంపై ఖమ్మం డీఎస్ఓ గంగాధర్‌ను 'సాక్షి' వివరణ కోరగా సొసైటీ సమస్య తమదృష్టికి వచ్చిందని, త్వరలోనే పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు.

ఒడిశా మహిళను కుటుంబం చెంతకు చేర్చిన 'అన్నం'

ఖమ్మంఅర్బన్: మతిస్థిమితం కోల్పోయి సరిహద్దులు దాటి వచ్చిన మహిళకు అన్నం ఫౌండేషన్‌లో ఆశ్రయం కల్పించి ఆమె ఆరోగ్యం కుదటపడ్డాక కుటుంబానికి అప్పగించారు. ఒడిస్సా రాష్ట్రం సుబర్ణపూర్ జిల్లా తులుంగ్ గ్రామానికి చెందిన 35ఏళ్ల నీలాద్రి బెహరా మతిస్థిమితం కోల్పోగా ఎనిమిది నెలల ఇంటి నుంచే బయటకు వచ్చింది. ఎక్కడెక్కడో తిరుగుతూ మూడు నెలల క్రితం ఖమ్మంలోని శ్రీరామ్‌నగర్‌కు చేరుకోగా రాత్రి వేళ తిరుగుతున్న ఆమె విషయమై స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు నీలాద్రిని అన్నం ఫౌండేషన్‌లో చేర్పించగా ఆమెకు వైద్యం చేయించి వివరాలు ఆరా తీయడంతో స్వస్థలం, కుటుంబ వివరాలు చెప్పింది. ఈమేరకు తులుంగ గ్రామసర్పంచ్‌కు సమాచారం ఇవ్వగా కుటుంబీకులు ఫొటో చూసి నీలాద్రిని గుర్తుపట్టారు. అయితే, వారిది నిరుపేద కుటుంబం అని తెలుసుకున్న అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు బోడేపూడి విజ్ఞాన కేంద్రం అంబులెన్స్‌లో ఆమెను 800 కిలోమీటర్ల దూరంలోని స్వస్థలానికి చేర్చి సోమవారం అక్కడి సర్పంచ్, సీఐ సుభాకర్ సేథ్ సమక్షాన నీలాద్రిని తల్లి ఊర్వసి, కుమారుడు ప్రిన్స్‌కు అప్పగించడంతో వారు అన్నం శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.



నీలాద్రిని కుటుంబానికి అప్పగిస్తున్న శ్రీనివాసరావు

కోమట్లగూడెంలో చోరీ

చింతకాని: మండలంలోని కోమట్లగూడెంలో తాళం వేసిన ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన రాచబంటి చంద్రయ్య తాళం వేసి భార్యతో కలిసి ఆదివారం కొణిజర్ల మండలం పెద్దగోపతిలోని చర్చికి వెళ్లాడు. ఈవిషయాన్ని గమనించిన ఇద్దరు వ్యక్తులు ఇల్లు, లోపలి బీరువా తాళాలు పగులగొట్టి రూ.1.20 లక్షల నగదుతో పాటు రెండు తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. అయితే, నిందితులు పారిపోతుండగా ఇంటి ముందు గదిలో నివాసముండే చంద్రయ్య కుమారుడు వలరాజు వెంటబడినా దొరకలేదు. ఘటనపై చంద్రయ్య చేసిన ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

ఉద్యోగం ఇప్పిస్తానని రూ.లక్షన్నర స్వాహా

కామేపల్లి: నిరుద్యోగుల బలహీనలను ఆసరా చేసుకుంటున్న కొందరు వసూళ్లకు తెగబడుతున్నారు. ఇదేరీతిలో మోసపోయిన కామేపల్లి జీపీ పరిధి గోపాలపురానికి చెందిన కొర్ర సంఘవి సోమవారం వెల్లడించిన వివరాలు... సంఘవి ఇంటర్ పూర్తి చేసి చిరుద్యోగం కోసం ప్రయత్నిస్తుండగా గ్రామానికే చెందిన ఆమె బంధువులైన దంపతులు సంప్రదించారు. ఖమ్మంకు చెందిన ఓ వ్యక్తికి రూ.3లక్షలు ముట్టజెబితే కొత్తగూడెం మెడికల్ కాలేజీలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికారు. దీంతో ఆమె 2022లో రూ.50వేలు, ఆతర్వాత రూ.లక్షన్నర ఇచ్చింది. మిగతా నగదు ఉద్యోగం వచ్చాక ఇవ్వాలని చెప్పారు. అయితే, నాటి నుంచి దాటవేత ధోరణి అవలంబిస్తుండడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సంఘవి తెలిపింది.



వివరాలు వెల్లడిస్తున్న సంఘవి

ఇద్దరిపై కేసు నమోదు

చింతకాని: ఇతరుల వ్యవసాయ భూమిలో రహదారి నిర్మాణం చేపట్టడమే ఇదేమిటని అడిగితే దూషించిన చింతకాని మండలం నాగులవంచకు చెందిన వంకాయలపాటి సత్యనారాయణ, ఖమ్మం కార్పొరేషన్ పరిధి కొత్తగూడెంకు శీతల రామసంగంపై సోమవారం కేసు నమోదైంది. నాగులవంచకు చెందిన వంకాయలపాటి దాసయ్యకు చెందిన వ్యవసాయ భూమిలోకి రామసంగం, సత్యనారాయణ ఈనెల 22న అక్రమంగా ప్రవేశించి రహదారి నిర్మాణం చేపట్టారు. ఈ విషయం తెలిసిన దాసయ్య కుమారుడు రామారావు వెళ్లి ప్రశ్నించగా దూషిస్తూ చంపుతామని బెదిరించారు. దీంతో రామారావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

పందెం కోళ్లను ఎత్తుకెళ్లిన దొంగలు

కామేపల్లి: గుర్తు తెలియని వ్యక్తులు పందెం కోళ్లను ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని జోగ్గూడెంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జర్పుల చంద్రు, రామోజీ 25 పందెం కోళ్లను పెంచుతున్నారు. గుర్తు తెలియని దొంగలు ఫాంలోకి చొరబడి జాలీ కత్తిరించి సుమారు రూ.లక్ష విలువైన కోళ్లను ఎత్తుకెళ్లడంతో బాధితులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గొర్రెపొట్టేళ్లు, మేకపోతు...

ముదిగొండ: ఇంటి ఆవరణలో కట్టేసిన రెండు గొర్రె పొట్టేళ్లు, ఒక మేకపోతును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. మండలంలోని బాణాపురానికి చెందిన వత్సవాయి దేవేందర్ రూ.80వేలు విలువైన రెండు గొర్రెపొట్టేళ్లు, ఒక మేకపోతు ఆయన కుమార్తె వివాహ విందు కోసం కొనుగోలు చేశాడు. వీటిని ఇంటి ఆవరణలో కట్టేయగా ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ విషయమై సోమవారం దేవేందర్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ ఓ.మురళి తెలిపారు.

80 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్



స్వాధీనం చేసుకున్న బియ్యంతో ఉద్యోగులు

కారేపల్లి: ఖమ్మం టాస్క్‌ఫోర్స్ ఉద్యోగులు, కారేపల్లి పోలీసులు సంయుక్తంగా చేపట్టిన తనిఖీల్లో 80క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. మండలంలోని చెన్నంగులగడ్డలో బియ్యం నిల్వ చేశారనే సమాచారంతో ఆదివారం రాత్రి సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఓ ఇంట్లో నిల్వ ఉంచిన 80క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి వాహనంలో కారేపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇల్లెందు మండలానికి చెందిన వ్యాపారి ఇందుకు బాధ్యుడని తేలగా బత్తుల సంతోష్, ఆవుల సంపత్, బత్తుల రాజు, బత్తుల నవీన్‌పై కేసు నమోదు చేసినట్లు కారేపల్లి ఎస్ఐ ఎన్.రాజారాం తెలిపారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీ రేగా కాలనీకి చెందిన దంపతులు సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. మండలపు వెంకటకృష్ణ, స్వప్న మధ్య కొంత కాలంగా తగాదాలు జరుగుతున్నాయి. సోమవారం కూడా గొడవపడ్డారు. ఇంట్లోనే పురుగుల మందు తాగారు. స్థానికులు గమనించి 108 అంబులెన్స్ ద్వారా భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా, ఇద్దరి పరిస్థితి నిలకడగానే ఉన్నట్టు తెలిసింది.

మద్యానికి బానిసై ఆత్మహత్య

కారేపల్లి: మద్యానికి బానిసైన వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని గాంధీనగర్‌కు చెందిన ఎల్లబోయిన అన్వేష్‌దొర(32) మద్యానికి బానిసయ్యాడు. దీంతో విసిగిపోయిన ఆయన భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన అన్వేష్ సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా ఆయన తల్లి రాంబాయి పిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎన్.రాజారాం తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి

సింగరేణి(కొత్తగూడెం): రుద్రంపూర్ పంచాయతీ నాలేరియా ప్రాంతానికి చెందిన ఉడుతల కృష్ణమ్మ (102) అనారోగ్యంతో సోమవారం మృతిచెందింది. ఆమె భర్త సిద్ధయ్య సుమారు 40 ఏళ్ల క్రితం మృతి చెందాడు. మృతురాలికి ముగ్గురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. స్థానిక నాయకుడు మామిడి రాజేశ్వరరావు, విశ్వమాత మదర్ థెరిస్సా సేవా సంస్థ నిర్వాహకులు గూడెల్లి యాకయ్య, పొనగంటి రాజు, యాదగిరి, బండారి నాగేశ్వరరావు, బాస్కర్, ఓదెమ్మ తదితరులు మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు.



కృష్ణమ్మ (ఫైల్)

వ్యవసాయ శాఖ బదిలీల్లో పైరవీలు

- తొలిదశలో పలు పోస్టుల 'బ్లాక్'
- ఆపై దక్కించుకున్న అధికారులు

ఖమ్మంవ్యవసాయం: వ్యవసాయ శాఖలో ఇటీవల జరిగిన బదిలీల్లో పైరవీలు రాజ్యమేలినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అన్ని ప్రభుత్వ శాఖల్లో మాదిరిగానే ఈనెల 2, 3వ తేదీల్లో ఏఈఓలు, ఏఓలకు, ఈనెల 20న వ్యవసాయ సహాయ సంచాలకులు, ఉప సంచాలకులు, సంయుక్త సంచాలకుల బదిలీలు చేపట్టారు. ఒకే చోట్ల నాలుగేళ్ల సర్వీస్ నిండిన వారిని బదిలీ చేస్తూ మొత్తం ఉద్యోగుల్లో 40 శాతం మించకుండా చూడాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకోసం అధికారులు, ఉద్యోగులు ఆప్షన్ ఇచ్చినా వాటిని పక్కనబెట్టి ఇష్టారాజ్యంగా బదిలీలు చేశారని శాఖలో చర్చ జరుగుతోంది. జోన్ పరిధి ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం తదితర జిల్లాల్లో కొన్ని పోస్టులను బ్లాక్‌లో పెట్టి ప్రకియ చేపట్టారని... ఆతర్వాత కొందరు అధికారులు దొడ్డిదారిన ఆ పోస్టులను దక్కించుకున్నారనే విమర్శలు వస్తున్నాయి. సీనియారిటీ, ఇతర అర్హతల ఆధారంగా బదిలీలు చేపడితే ఆయా ఉద్యోగులకు బ్లాక్ చేసిన పోస్టులు దక్కవని తెలుస్తోంది. ఈ కారణంగా అర్హులైన కొందరు అధికారులకు దూర ప్రాంతాల్లో పోస్టింగ్ రావడంతో ఆవేదన చెందుతున్నారు. ఇక కొన్ని పోస్టులకు అర్హత కలిగిన అధికారులు ఉన్నా భర్తీ చేయకుండా ఇన్‌చార్జిలకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించడం విమర్శలకు తావిస్తోంది. ఈమేరకు రూ.లక్షల్లో చేతులు మారినట్లు ప్రచారం జరుగుతుండగా పలువురు ప్రజాప్రతినిధుల ప్రమేయం ఉందనే చర్చ జరుగుతోంది.

జమలాపురంలో శ్రీ కృష్ణాష్టమి

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న గోకులంలో శ్రీకృష్ణుడికి అర్చకులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత స్వామి వారికి అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించగా.. అనంతరం శ్రీకృష్ణుడు, గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే, కృష్ణాష్టమి పర్వదిన ప్రాధాన్యతను ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ భక్తులకు వివరించారు. ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.



గోకులంలో పూజలు చేస్తున్న అర్చకులు

తండా నుంచి ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజనీర్‌గా...

అర్హత సాధించిన గిరిజన బిడ్డ నవీన్

నేలకొండపల్లి: మారుమూల గ్రామంలోని గిరిజన కుటుంబంలో పుట్టిన ఓ యువకుడు... నేడు విమానాల నిర్వహణ బాధ్యతలు నిర్వర్తించే ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజనీర్‌గా అర్హత సాధించాడు. నేలకొండపల్లి మండలం మంగాపురం తండాకు చెందిన ధనావత్ వెంకన్న–బుచ్చి కుమారుడు నవీన్‌ను తల్లిదండ్రులు వ్యవసాయ పనులు చేస్తూ చదివించారు. పదో తరగతి వరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ఇంటర్ నేలకొండపల్లిలోని గౌతమ్ కాలేజీ, హైదరాబాద్‌లో బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సు పూర్తిచేశాడు. ఆతర్వాత ఐదేళ్ల పాటు ఎయిర్ క్రాఫ్ట్ మెయింటెన్స్ ఇంజనీర్ ట్రెనింగ్ చేసిన ఆయన డీజీసీఏ నిర్వహించిన పరీక్షలో ప్రతిభ చాటి డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ఎయిర్ క్రాఫ్ట్ ఇంజనీర్‌గా ఇటీవల లైసెన్స్ సాధించాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్ పోర్టులో విధులు నిర్వర్తిస్తున్న నవీన్‌ను మాజీ సర్పంచ్ భూక్యా సుధాకర్, తండావాసులు అభినందించారు.



విధుల్లో భాగంగా విమానంలో పరిశీలిస్తున్న నవీన్

సోషల్ మీడియాదే కీలకపాత్ర

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజలు సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు పరిష్కరించడంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. సీపీఎం సోషల్ మీడియా విభాగం రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు ఖమ్మంలోని సుందరయ్య భవన్‌లో సోమవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర నాయకుడు పిట్టల రవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తమ్మినేని మాట్లాడుతూ ప్రధాన మీడియా కార్పొరేట్ కనుసన్నల్లో మెలుగుతున్న దశలో సోషల్ మీడియా గ్రామీణ స్థాయి ప్రజల ఇబ్బందులు, పాలకుల దివాళాకోరు విధానాలను వెలుగులోకి తీసుకురావాలని సూచించారు. పార్టీ పనివిధానం, సిద్ధాంతాలను ప్రజలకు తెలియజేయడంలో సరైన కార్యాచరణ లేక ఇబ్బంది పడుతున్న నేపథ్యాన పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా తీసుకెళ్లేందుకు సోషల్ మీడియాను ఉపయోగించుకుంటున్నట్లు చెప్పారు. కాగా, దేశంలో మూడో సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ అబద్ధాలతో సోషల్ మీడియా ద్వారా విషం వెదజల్లుతున్నందున ఇదే వేదిక ద్వారా ప్రజలకు వాస్తవాలు తెలియచేయాలని తమ్మినేని సూచించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు అబ్బాస్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు బండారు రవికుమార్, జగదీష్, వై.విక్రమ్, సుందర్, శంకర్, నర్సిరెడ్డి, నవీన్‌రెడ్డి, గొడుగు వెంకట్, సోమన్న తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న వీరభద్రం

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి మంజువాణి మృతి

ఖమ్మంగాంధీచౌక్: జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అత్తోటి మంజువాణి(60) సోమవారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఈ ఏడాది మే 17న దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. కొద్ది రోజులుగా హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స చేయిస్తుండగా సోమవారం మృతి చెందారు. హైదరాబాద్ రాష్ట్ర గ్రంథాలయంలో పనిచేస్తున్న మంజువాణి 2021 ఫిబ్రవరిలో పదోన్నతిపై ఖమ్మం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శిగా వచ్చారు. హైదరాబాద్‌కు చెందిన ఆమె భర్త రవికుమార్ ఎస్సీగా పనిచేసి రిటైర్ కాగా, వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా, మంజువాణి మృతిపై గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కేబీఎస్ఎల్ఎన్.రాజు, ఎండీ.ఇమామ్‌తో పాటు జె.భాస్కర్‌రావు, వేల్పుల అర్జున్, అఖిల్, కనకవల్లి తదితరులు సంతాపం తెలిపారు.



మంజువాణి (ఫైల్)